సాక్షి
జయశంకర్ భూపాలపల్లి

మంగళవారం | 8 | ఏప్రిల్ | 2025



ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్

కేయూ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. - 8లో▸



సకాలంలో మిర్చి కొనుగోళ్లు చేపట్టాలి

రైతుల అవసరాలు, ఇబ్బందులు గుర్తించి సకాలంలో మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని ఆర్‌డీడీఎం పద్మావతి అన్నారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
36.4°/24.7°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం సమయంలో ఎండ తీవ్రత ఉంటుంది. రాత్రి సమయంలో అక్కడక్కడా చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

శివాలయానికి రూ.1.16లక్షల విరాళం



చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో నిర్మిస్తున్న శివాలయానికి గోపాలపూర్ గ్రామానికి చెందిన లక్ష్మణాచార్యులు(మూకయ్య) చిన్న కుమారుడు రంగాచార్యులు రూ.లక్ష పదహారు వేలు విరాళం అందజేసినట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కసిరెడ్డి రత్నాకర్‌రెడ్డి సోమవారం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు రఘునందన్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన వసంత నవరాత్రి ఉత్సవాలు



రేగొండ: కొత్తపల్లిగోరి మండలకేంద్రంలోని నవదుర్గ ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన వసంత నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. చివరి రోజు ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించిన అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. దుర్గమాతను బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు సూదనబోయిన విష్ణు యాదవ్, పెండ్యాల రాజు, రాంబాబు, వేణు, నరేష్, అనిల్, బాబురావు, వీరేశం, రాజు, విమల పాల్గొన్నారు.

ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్

భూపాలపల్లి అర్బన్: సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో అన్ని సింగరేణి పాఠశాలల్లో ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ నిర్వహించనున్నట్లు ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి జి.శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పాలిసెట్ రాసే విద్యార్థుల కోసం ఏరియాలోని సింగరేణి ఉన్నత పాఠశాలలో శిక్షణ తరగతులను ఈ నెల 10వ తేదీన ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సింగరేణి కార్మికుల పిల్లలతో పాటు పరిసర గ్రామాల విద్యార్థులు కూడా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాలిటెక్నిక్ ద్వారా అపారమైన ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు.

మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

భూపాలపల్లి అర్బన్: రాజీవ్ యువ వికాసం స్కీం దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసేందుకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటుచేసినట్లు మున్సిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వారు సంబంధిత ధృవీకరణ పత్రాలను కార్యాలయంలోని రూమ్ నంబర్ 12లో అందజేయాలని సూచించారు.

ఆరోగ్యంగా జీవించడం మానవుడి హక్కు

భూపాలపల్లి అర్బన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని.. ఆరోగ్యంగా జీవించడం మానవుడి హక్కు అని సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జయరాం రెడ్డి తెలిపారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ హాలులో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జడ్జి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. న్యూట్రిషన్ ఆహారం తీసుకుంటూ, వ్యాయామం, యోగ లాంటి అలవాట్లను కలిగి ఉంటే రోగాలు దరిచేరవన్నారు. వేసవిలో పనిచేసే ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు విరివిగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కారు పల్టీ.. ముగ్గురికి గాయాలు

గోవిందరావుపేట: మండల పరిధిలోని పస్రా గుండ్లవాగు కార్నర్ సమీపంలో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ కారు పల్టీలు కొట్టింది. ఈ ఘటన సోమవారం చోటుచేసుకోగా ముగ్గురు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే..ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాకు చెందిన సత్యేంద్ర వరంగల్ వైపునకు కారులో వస్తుండగా వాహనం అదుపు తప్పి పల్టీలు కొట్టి రోడ్డు కింద పడిపోయింది. ఈ క్రమంలో కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన ఇతర వాహనదారులు 108 వాహనానికి సమాచారం అందించగా అక్కడకు చేరుకున్న సిబ్బంది గాయపడిన వారిని ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

పరిష్కారమెప్పుడో..?

- ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ
- వివిధ సమస్యలపై 48 అర్జీలు..
- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి
- కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి అర్బన్: ప్రజావాణిలో సమస్యలకు పరిష్కారం లభించడంలేదని ప్రజలు వాపోతున్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన గ్రీవెన్స్‌లో జిల్లా నుంచి మొత్తం 48 దరఖాస్తులు వచ్చాయి. కలెక్టర్ రాహుల్‌శర్మ, అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, ఆర్డీఓ రవి కలిసి అర్జీలను స్వీకరించారు. వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అధికారులు నిర్దిష్ట సమయంలో స్పందించాలని సూచించారు. ప్రజలు అధికారులను నేరుగా కలిసే వేదిక ప్రజావాణి అని ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించి ప్రజల మన్ననలు పొందాలన్నారు.



కలెక్టర్ రాహుల్‌శర్మతో తమ సమస్యలు చెబుతున్న ప్రజలు

ఉపాధి కల్పిస్తామని పట్టించుకోవడం లేదు..



జిల్లా కేంద్రంలో నిర్మించిన కలెక్టరేట్ స్థలంలో 141 సర్వే నంబర్‌లో మా తండ్రి పేరున ఉన్నటువంటి ఐదున్నర గుంటల భూమిని కోల్పోయాం. అప్పటి కలెక్టర్ భవేష్‌మిశ్రా నష్టపోయిన భూమికి బదులుగా ఉపాధి అవకాశం కల్పిస్తామని చెప్పారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఏదైనా ఉద్యోగ అవకాశం కల్పించాలి.

- కామారపు రవికుమార్, ఇస్సిపేట

ఆధార్ సెంటర్ ఏర్పాటుకు అవకాశం కల్పించాలి..



దివ్యాంగుడినైనా నాకు జీవనోపాధి కోసం కలెక్టర్ స్పందించి ఆధార్ సెంటర్, మీసేవా కేంద్రం ఏర్పాటుకు అవకాశం కల్పించాలి. 2019 సంవత్సరం నుంచి జీవనోపాధి కోసం ఎదురు చూస్తున్నాను. ప్రస్తుతం గ్రామంలోనే సీఎస్సీ కేంద్రాన్ని నడిపిస్తున్నారు. ఆధార్ ఆపరేటర్ సూపర్‌వైజర్ ట్రెనింగ్ పూర్తిచేశాను. గ్రామాల్లో ఆధార్ సెంటర్ లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నాకు ఆధార్ సెంటర్ కేటాయించినట్లయితే గ్రామాల్లో ప్రజలకు సేవలందిస్తాను.

- సంగీ శంకర్, దుబ్యాల, టేకుమట్ల

పింఛన్‌ను పునరుద్ధరించడం లేదు..



ఆరు సంవత్సరాలుగా బోదకాలుతో బాధపడుతుండగా పింఛన్ అమలు చేశారు. ఎనిమిది నెలల క్రితం పింఛన్ ఆగిపోయింది. నాటి నుంచి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పింఛన్ రావడం లేదు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో జరిగిన సదరం క్యాంపునకు వెళ్లగా ఫైలేరియా అని గుర్తించారు. పింఛన్ కోసం తిరిగితిరిగి అలసిపోతున్నాం. కలెక్టర్ స్పందించి పింఛన్ ఇప్పించాలి.

- కామారపు నాగబూషణం, ఇస్సిపేట

పెయింటింగ్ డబ్బులు ఇవ్వలేదు..



గతేడాది ఆగస్టు మాసంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలం రేపాక, చిట్యాల మండలం జూకల్లు గ్రామాల్లోని అంగన్‌వాడీ సెంటర్‌లను మోడల్ అంగన్‌వాడీలుగా మార్చే క్రమంలో పెయింటింగ్ వేశాం. రూ.1.10లక్షలు ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు సంబంధిత శాఖ అధికారులు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. అప్పులు చేసి పెయింటింగ్ డబ్బాలు, ఇతర మెటీరియల్ తీసుకువచ్చి వేశాం. స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా చిట్యాల మండలం ముచినీపర్తి, ఏలేటిరామయ్యపల్లి, గుంటూరుపల్లి గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించే పెయింటింగ్స్ వేశాం. దానికి సంబంధించిన డబ్బులు ఇవ్వడం లేదు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు.

- సుదమల్ల రమేశ్, ఆర్టిస్ట్, రేపాక, రేగొండ

65ఏళ్లు.. పింఛన్ రావట్లే..



నాలుగు సంవత్సరాల క్రితం నా భార్య పోషక్క చనిపోయింది. నాకు నా రక్త సంబంధీకులు ఎవరూ లేరు. 65ఏళ్ల ఉన్న నాకు పింఛన్ రావడం లేదు. బతకడం ఇబ్బందికరంగా మారింది. ప్రభుత్వం స్పందించి పింఛన్ సౌకర్యం కల్పించాలి.

- తోటపల్లి మల్లయ్య, కాటారం

పేదల కళ్లలో ఆనందం

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు
- గిరిజన కుటుంబంతో కలిసి సహపంక్తి భోజనం

భూపాలపల్లి రూరల్: పేదల ముఖంలో వెలుగును చూడాలనే దృఢ సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్నబియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి మండలం ఆజాంనగర్ గ్రామంలో తోట చంద్రమౌళి– సరిత గిరిజన కుటుంబసభ్యులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సన్నబియ్యంతో సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి దంపతులకు దుస్తులు బహూకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గతంలో రేషన్ షాపుల్లో దొడ్డు బియ్యం ఇస్తే ప్రజలు తినకపోయేదన్నారు. బియ్యం దళారుల పాలు అయ్యేదని చెప్పారు. పేదల ఇళ్లలో భోజనం చేయడం, వారి కళ్లలో ఆనందాన్ని చూడడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా రుణాలు అందించి ఆదుకుంటామన్నారు. పంబాపూర్ రేషన్ డీలర్ సమ్మయ్య దీక్షకుంటలో 200 కార్డులతో ప్రత్యేకంగా షాపును ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే షాపును ప్రారంభించి పంపిణీ చేశారు. పేదల దగ్గరికే బియ్యాన్ని తెచ్చి పంపిణీ చేయడంతో డీలర్ సమ్మయ్యను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పౌరసరఫరాల డీఓ రాములు, సివిల్ సప్లయ్ అధికారి శ్రీనాథ్, ఆర్‌టీఏ మెంబర్ సుంకరి రాంచంద్రయ్య పాల్గొన్నారు.



ఆజాంనగర్‌లో గిరిజనులతో కలిసి సహపంక్తి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

ప్రత్యేక పూజలు

భూపాలపల్లి మండలం కొంపెల్లి గ్రామంలో గొడ్నల ఆరాధ్య దైవం రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

కాటారం: రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛ, సమానత్వ హక్కులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని స్టేట్ ఆయిల్ సీడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కాటారం మండలకేంద్రంలో సోమవారం జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి రాఘవరెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకుడు దుద్దిళ్ల శ్రీనుబాబు గారెపల్లిలో ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలిలోని అంబేడ్కర్, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ మహాత్మాగాంధీ చూపిన శాంతి, అహింసా సిద్ధాంతాలను బీజేపీ విస్మరిస్తోందన్నారు. అనంతరం రాజ్యాంగ పరిరక్షణ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీటూరి మహేశ్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న రాఘవరెడ్డి, శ్రీనుబాబు, నాయకులు

చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌ఓ మధుసూదన్

కాటారం: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న ఆరేళ్లలోపు చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ మధుసూదన్ తెలిపారు. జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో చేపడుతున్న కార్యక్రమాన్ని సోమవారం డీఎంహెచ్‌ఓ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ చిన్నతనంలోనే ఆరోగ్య, మానసిక సమస్యలను గుర్తించేందుకు జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా ప్రత్యేక కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఆరేళ్ల లోపు చిన్నారుల్లో ఎక్కువ శాతం నేత్ర సమస్యలు, మానసిక సమస్యలు వస్తున్న నేపథ్యంలో ఈ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రమోద్, ఆర్‌బీఎస్‌కే డాక్టర్ బండి శ్రీనివాస్, డాక్టర్ సుజాత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆరోగ్య మిషన్ శిబిరాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ మధుసూదన్

ఆరు ఎకరాల మామిడితోట దగ్ధం



మామిడితోట వద్ద కాపలా ఉన్న వర్కర్



కాలిపోయిన మామిడిచెట్లు

- రెండు వేల చెట్లు అగ్నికి ఆహుతి
- రూ.20 లక్షల నష్టం

వెంకటాపురం(ఎం): మండల పరిధిలోని రామక్రిష్టాపూర్ పరిధిలో గల మోకిరాల తిరుపతిరావుకు చెందిన మామిడి తోటకు సోమవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో సుమారు రెండు వేల చెట్లు కాలిపోయాయి. చెల్పూరుకు చెందిన తిరుపతిరావు రామక్రిష్టాపూర్ పరిధిలో ఆరు ఎకరాల్లో హిమయిత్, దశరి రకంకు చెందిన 8 ఏళ్ల వయస్సు గల రెండు వేల మామిడి చెట్లను సాగు చేస్తున్నాడు. బాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగేళ్లుగా క్రాప్ వస్తుందని తిరుపతిరావు పేర్కొన్నారు. మామిడితోట వద్ద వర్కర్లు కాపలా ఉంటున్నారు. సోమవారం ఉదయం కొంతమంది వ్యక్తులు మామిడితోట వైపునకు వచ్చి వెళ్లిన కొద్దిసేపటికే తోటలో మంటలు చేలరేగడంతో వర్కర్లు నాలుగు మోటార్ల సహాయంతో మంటలను ఆర్పివేసే ప్రయత్నం చేశారు. అయినా అదుపులోకి రాలేదు. పంట చేతికి వచ్చేదశలో మామిడిచెట్లు కాలిపోవడంతో పాటు డ్రిప్ పైపులు పూర్తిగా కాలిపోవడంతో సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తిరుపతిరావు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ వేగవంతం

- కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి: జిల్లాలో తలపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియను వేగవంతం చేసి త్వరితగతిన గ్రౌండింగ్ చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ హౌసింగ్ అధికారులకు సూచించారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని మొదటి అంతస్తులో గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ కార్యాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లకు ఎంపికైన లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి గడువులోపు పూర్తి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, హౌసింగ్ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ లోకిలాల్, డీఈ శ్రీకాంత్, ఏఈ రాజలింగం తదితరులు పాల్గొన్నారు.



భూపాలపల్లి: హౌసింగ్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ



కాటారం: వైద్య శిబిరంలో వైద్యసేవలను పరిశీలిస్తున్న కలెక్టర్, శ్రీనుబాబు

కంటి వైద్య శిబిరంతో ప్రతి ఒక్కరికీ మేలు

కాటారం: కంటి వ్యాధులతో బాధపడుతున్న ప్రతి ఒక్కరికి ఉచిత కంటి వైద్య శిబిరంతో ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు వర్ధంతిని పురస్కరించుకొని పుష్పగిరి కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో కాటారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శ్రీపాద ట్రస్టు చైర్మన్ శ్రీనుబాబుతో కలిసి కలెక్టర్ రాహుల్‌శర్మ ప్రారంభించారు. అంతకుముందు శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి పరీక్షలు చేయించుకునే ఆర్థిక స్తోమత లేని వారికి ఈ ఉచిత వైద్య శిబిరం ఉపయోగపడుతుందన్నారు. కంటి చూపు లోపం ఉన్న ప్రతి ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శ్రీనుబాబు మాట్లాడుతూ పుష్పగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆపరేషన్ అవసరమైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా చేయించడంతో పాటు కంటి అద్దాలు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి మధుసూదన్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కోట రాజబాబు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ అధ్యక్షుడు చీటూరి మహేశ్‌గౌడ్, మహిళా అధ్యక్షురాలు జాడి మహేశ్వరి, మండల వైద్యాధికారిణి మౌనిక, నాయకులు పాల్గొన్నారు.



కాటారం: పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్

గ్రూప్స్ విజేతలకు సన్మానం

ఎస్‌ఎస్ తాడ్వాయి: ఇటీవల విడుదలైన గ్రూప్స్‌లో విజయం సాధించి ఉద్యోగాలకు ఎంపికైన మండల పరిధిలోని కాటాపూర్‌కు చెందిన బెల్లంకొండ నవీన్, సెంట్రల్ జీఎస్టీ అండ్ కస్టమ్స్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న కరుణాకర్ గ్రూప్ 2లో ర్యాంకు సాధించి ప్రస్తుతం జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. సోమవారం వీరిని బతుకమ్మ కమిటీ సభ్యులు గ్రూప్స్ విజేతలతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ కాటాపూర్‌కు చెందిన నవీన్, కరుణాకర్ ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

పుష్కరాల పనులు పూర్తిచేయాలి

- కలెక్టర్ రాహుల్‌శర్మ
- దేవస్థాన కార్యాలయంలో సమీక్ష

కాళేశ్వరం: మే 15నుంచి 26వరకు జరగనున్న సరస్వతీ నది పుష్కరాల అభివృద్ధి నిర్మాణ పనులను మే 4వరకు పూర్తిచేయాలని ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మితో కలిసి అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. ముందుగా జ్ఞాన సరస్వతి (వీఐపీ)ఘాటు వద్ద నిర్మాణంలో ఉన్న పుష్కరఘాటును పరిశీలించి ఈఈ తిరుపతిరావుతో మాట్లాడారు. సరస్వతీ మాత విగ్రహ ఏర్పాటుకు జరుగుతున్న నిర్మాణ పనులను, శాశ్వత ప్రాతిపదికన నిర్మిస్తున్న మరుగుదొడ్ల పనులను పరిశీలించారు. ప్రధాన ఘాట్ వద్ద జరుగుతున్న మరుగుదొడ్ల పనులు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, స్వాగత తోరణం పనులు, పుష్కర ఘాట్లలో స్నానఘట్టాలు, నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా నిర్మిస్తున్న తాగునీటి ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం దేవస్థానం ఈఓ కార్యాలయంలో అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మే నెలలో కాళేశ్వరంలో నిర్వహించే సరస్వతీ పుష్కరాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. కొన్నిచోట్ల శాశ్వత ప్రాతిపదికన పనుల నిర్మాణాలు చేపడుతున్నట్లు తెలిపారు. త్వరితగతిన నిర్మాణ పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా మరుగుదొడ్లు, తాగునీరు, పుష్కరఘాట్లలో స్నానఘట్టాలు, బట్టలు మార్చుకునే గదులు, చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టర్‌తో పాటు ఈఓ మహేష్, డీపీఓ నారాయణరావు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సీఐ రామచందర్‌రావు, స్థానికులు శ్రీనివాసరెడ్డి, అశోక్ ఉన్నారు.



జ్ఞానతీర్థం పుష్కరఘాటు పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ, అధికారులు

చెట్లను తొలగించాలా.. వద్దా..

కాళేశ్వరంలోని ఆర్చిగేటు నుంచి వీఐపీ ఘాటు వరకు రోడ్డు వెడల్పు పనులు జరుగుతున్నాయి. ఎడమ వైపున భారీ వృక్షాలు ఐదారు వరకు ఉన్నాయి. సోమవారం కలెక్టర్ రాహుల్‌శర్మ పనులకు పరిశీలనకు రాగా కాంట్రాక్టర్లు వృక్షాలు తొలగిస్తామని చెప్పారు. ఆయన స్పందించి వృక్షాలను తొలగించవద్దని చెప్పారు.

తమ భూమిలో స్తంభాలు వేయొద్దు..

ప్రధాన గోదావరిఘాటు వద్ద స్థానిక భూ యజమానులు తమభూమిలో అనుమతి లేకుండా విద్యుత్ స్తంభాలు ఎలా వేస్తారని కలెక్టర్‌తో మొరపెట్టుకున్నారు. పట్టా పరిశీలించాలని డీటీ కృష్ణకు ఆదేశించారు.

ఎండవేడికి తట్టుకోలేక..



జిల్లావ్యాప్తంగా రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. ఇప్పటికే 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుంది. చిన్న పిల్లలతో పాటు వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పది గంటల తర్వాత బయటకు వెళ్లాలంటేనే భయమవుతుంది. ఎండవేడికి తట్టుకోలేక చిట్యాల మండలం ముచినిపర్తి గ్రామ శివారులో సోమవారం నీటితొట్టిలో పిల్లలు ఈత కొడుతుండగా 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– చిట్యాల

డాక్టర్లు మారినా.. పేర్లు మారలే..



చిట్యాల సామాజిక ఆరోగ్య కేంద్రం (సివిల్ ఆస్పత్రి) సూపరింటెండెంట్‌గా జీడి తిరుపతి పనిచేసిన సమయంలో ఆస్పత్రిలో గోడపై డాక్టర్ల పేర్లు రాయించారు. అప్పుడు ఏడుగురు పనిచేయగా.. ఆ తర్వాత ఆరుగురు వైద్యులు బదిలీ అయ్యారు. డాక్టర్ శ్రీకాంత్ మాత్రమే ప్రస్తుతం ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. కానీ బోర్డులో పేర్లు మాత్రం అలాగే ఉన్నాయి. దీంతో బోర్డుపై ఉన్న డాక్టర్లు ఇక్కడే పని చేస్తున్నారా.. అంటూ రోగులు, ప్రజలు చర్చించుకుంటున్నారు. కనీసం బోర్డును కూడా పట్టించుకోవడం లేదు.

– చిట్యాల

క్లుప్తంగా

టెన్త్ స్పాట్ వాల్యుయేషన్ ప్రారంభం

- 957మంది టీచర్లకు 728 మంది రిపోర్టు
- హాజరుకాని వారిస్థానంలో వేరేవారికి అవకాశం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా కాజీపేట ఫాతిమా హైస్కూల్‌లోని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో సోమవారం పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం ప్రారంభమైంది. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలనుంచి 957మంది ఉపాధ్యాయులను సీఈలు, ఏఈలుగా నియమించారు. ఇందులో 728మంది రిపోర్టు చేశారు. తొలిరోజు వివిధ సబ్జెక్టు టీచర్లకు ఒక్కొక్కరికి 15 జవాబుపత్రాలు అందజేసినట్లు సమాచారం. స్పెషల్ అసిస్టెంట్లు ఎస్‌జీటీలు 217మంది వరకు హాజరైనప్పటికీ, సబ్జెక్టు టీచర్లు కొందరు హాజరుకాలేదు. అనారోగ్య కారణాలు చూపుతూ పలువురు టీచర్లు హాజరుకాలేదని సమాచారం. సబ్జెక్టు టీచర్ల స్థానంలో అక్కడ క్యాంపునకు వచ్చిన ఇతర స్కూల్ అసిస్టెంట్లకు విధులు అప్పగిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈనెల 8న కూడా కొనసాగే అవకాశాలున్నాయి. డుమ్మా కొట్టిన టీచర్లపై ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే. క్యాంపు ఆఫీసర్‌గా హనుమకొండ డీఈఓ డి.వాసంతి వ్యవహరిస్తున్నారు. వాల్యుయేషన్ కేంద్రాన్ని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి సందర్శించారు. కేంద్రంలోని సదుపాయాలను పరిశీలించారు. విధుల్లో ఉన్న ఉపాధ్యాయులతోనూ మాట్లాడారు.

ప్రాణం తీసిన ఈత సరదా..

- కాల్వలో పడి యువకుడి మృతి
- దంతాలపల్లిలో ఘటన

దంతాలపల్లి : ఈత సరదా.. ప్రాణం తీసింది. కాల్వలో పడి ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటన దంతాలపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా నర్సిపురం గ్రామానికి చెందిన మల్లీ ఏడుకొండలు(25) నెల రోజుల నుంచి దంతాలపల్లి మండలకేంద్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు శ్రీనివాస్ రాజ్ దగ్గర మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో ఆదివారం శ్రీరామ నవమి సందర్భంగా పనిలేకపోవడంతో రూమ్‌లోనే ఉన్నాడు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో సరదాగా ఈతకు వెళ్లి వస్తానని సహచరులకు చెప్పి రూమ్ నుంచి బయటకు వెళ్లాడు. అయితే ఎంతకూ రూమ్‌కు రాకపోవడంతో సహచరులు వెతకడం ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం మండల కేంద్రం గుండా ప్రవహిస్తున్న ఎస్సారెస్పీ 60 డీబీఎం కాల్వలో ఓ మృతదేహాన్ని చూసిన రైతులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహం ఏడుకొండలుగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏడుకొండలు కుటుంబ సభ్యులు వచ్చిన అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనునట్లు ఎస్సై రాజు తెలిపారు.

రక్తనిధి.. హతవిధీ!

ఎంజీఎం రక్తనిధి కేంద్రంలో నిండుకున్న నిల్వలు

- చిరిగిన బెడ్స్.. కనీస వసతులు కరువు
- కీలక విభాగాన్ని పట్టించుకోని అధికారులు
- పనిచేయని బ్లడ్‌బ్యాంక్ ఫోన్ నంబర్
- సేవలు మెరుగుపర్చాలని గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు


రక్తనిధి కేంద్రం


చిరిగి పక్కకు వంగిన బెడ్

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రికి నిత్యం ప్రాణాపాయ స్థితిలో వచ్చేవారు అనేకం. రోగులకు వైద్య సేవలందించడంలో రక్తనిధి పాత్ర కీలకం. అలాంటి బ్లడ్ బ్యాంక్ నిర్వహణను నిర్వాహకులు, ఎంజీఎం పరిపాలనాధికారులు గాలికి వదిలేశారు. పేదలకు రక్తం అందించేందుకు వచ్చిన దాతలకు కనీస సౌకర్యాలు అందడం లేదు. రక్త నిధి కేంద్రాన్ని పర్యవేక్షించే అధికారులు వివిధ పనులంటూ ఎప్పుడు.. ఎక్కడికి వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. రక్త నిధి కేంద్రంలో ఎన్ని నిల్వలున్నాయి? రిజర్వ్ చేసిన బ్లడ్ ఎంత? సమాచారం తెలుసుకునేందుకు బ్లడ్ బ్యాంక్ నంబర్ సైతం కొన్నేళ్ల నుంచి పనిచేయడం లేదు.


చిరిగిన బెడ్

చిరిగిన బెడ్స్

రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చేవారికి అండగా నిలవాలి. కానీ వారికి కనీస అవసరాలను కూడా అందించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం రక్తం సేకరించే క్రమంలో దాతలు పడుకునే బెడ్స్‌ను సైతం సమకూర్చలేని దుస్థితి ఎంజీఎంలో నెలకొంది. కాగా.. సమస్యలపై ఆస్పత్రి నిర్వాహకులు, అధికారులను ప్రశ్నిస్తే అన్నింటికీ వారు ఒకే సమాధానం చెబుతున్నారు. 'వ్యవస్థను ఒక్క రోజులో గాడిన పెట్టలేం' అంటూ దాటవేస్తున్నారు. జేబులు నింపుకునే ఫైళ్లపై చూపిస్తున్న ఆసక్తి సేవల మెరుగుదలకు చూపించడం లేదని కొన్ని నెలలుగా తీవ్రస్థాయిలో విమర్శలు వెలువెత్తుతున్నాయి.

ఈక్రమంలో ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఏకంగా 55సార్లు రక్తదానం చేసిన వ్యక్తి ఎంజీఎం రక్త నిధి కేంద్రానికి సౌకర్యాలు కల్పించాలంటూ సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటన రక్త నిధికేంద్ర నిర్వహణ పనితీరుకు నిదర్శనంగా చెప్పొచ్చు.

పని చేయని ఫోన్ నంబర్

ఎంజీఎం ఆస్పత్రిలో రక్త నిల్వల కోసం ప్రభుత్వం ఎంజీఎం సూపరిండెంట్ కోసం అధికారికంగా ఎలాగైతే నంబర్ కేటాయించారో.. సేవల్లో కీలకంగా ఉండే రక్త నిధి కేంద్రానికి సైతం 94906 1947 అనే నంబర్‌ను కేటాయించారు. ఈనంబర్‌ను ఉపయోగిస్తే విధులను కచ్చితంగా నిర్వర్తించాల్సి వస్తుందని తెలిసి కొన్నేళ్లుగా ఈ నంబర్‌ను వాడకుండా వదిలివేసినట్లు తెలుస్తోంది.

నిండుకుంటున్న నిల్వలు..

ఎంజీఎం ఆస్పత్రికి ప్రతీరోజు ప్రాణాపాయ స్థితిలో 10 నుంచి 20 మంది క్షతగాత్రులు వస్తుంటారు. వీరికి అత్యవసర పరిస్థితుల్లో రక్తం ఎక్కిస్తూ చికిత్సలు అందించాల్సి ఉంటుంది. ఇలాంటి రక్త నిధి కేంద్రంలో రోగులు ఎప్పుడు రక్తం కావాలని అడిగినా నిల్వలు నిండుకున్నాయని చెప్పడం పరిపాటిగా మారింది. అసలు ఎంజీఎం ఆస్పత్రిలో రక్తనిధి కేంద్ర సిబ్బంది పనితీరుపై దృష్టి సారించకపోవడంతోనే ఈ కేంద్రం అధ్వానంగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాం..



నేను ఇప్పటి వరకు 55 సార్లు రక్తదానం చేశా. 2017లో అప్పటి ఆర్ఎంఓకు బెడ్స్ గురించి తెలుపగా నామమాత్రంగా మరమ్మతులు చేశారు. ప్రస్తుతం రక్త నిధి కేంద్రానికి దాతలను తీసుకొస్తే చిరిగిపోయిన బెడ్స్ ఉన్నాయని, నిర్వహణ సరిగ్గా లేదని రక్తం ఇచ్చేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఎంజీఎం అధికారులకు తెలిపినా స్పందన లేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ప్రజావాణిలో కలెక్టర్ ఫిర్యాదు చేశాం.

\- అయిత ఉషాభాస్కర్

స్వరూపకు న్యాయం జరిగేదెప్పుడో..?

- 13 ఏళ్లుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు
- తొమ్మిదేళ్లు సీపీఐఎంఎల్ మావోయిస్టుగా కార్యకలాపాలు
- 2012లోనే లొంగుబాటు, పునరావాసం కింద అందని సహాయం


పాశం స్వరూప

సాక్షి, వరంగల్: అడవుల్లో తుపాకీ పట్టి ఆ తరువాత జనజీవన స్రవంతిలో కలిసిన మాజీ మావోయిస్టు.. తనకు లొంగుబాటు సమయంలో ప్రకటించిన పునరావాస ఫలాల కోసం అధికారుల చుట్టూ 13 ఏళ్లుగా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. ప్రస్తుత సిద్దిపేట జిల్లా చేర్యాల (ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సమయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా) మండలం కొమురవెల్లి గ్రామానికి చెందిన పాశం స్వరూప అడవిలో దాదాపు తొమ్మిదేళ్లు కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌లలో చివరగా సిరొంచ కమాండర్‌గా పనిచేస్తూ 2012లో పోలీసులకు లొంగిపోయింది. ఆ సమయంలో పునరావాసం కింద 500 గజాల ఇంటిస్థలం, ఐదెకరాల వ్యవసాయ భూమి ఇస్తామని పోలీసు అధికారులు ప్రకటించారు. రెవెన్యూ భూమి కేటాయించి నివేదిక సైతం ఇచ్చారు. కానీ అలాట్‌మెంట్ చేయలేదు. ఆమె కుటుంబపోషణ కోసం కొమురవెల్లి దేవస్థానం ప్రాంగణంలో కట్టెలు, పూలు అమ్ముకుంటూనే, జనజీవన స్రవంతిలో తనకు ప్రభుత్వం పునరావాసం కింద ఇస్తానన్న భూమి కోసం ఇంకా పోరాటం సాగిస్తూనే ఉంది. ఈ క్రమంలో వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చి మరోసారి కలెక్టర్ సత్యశారదకు తన బాధను ఏకరువు పెట్టుకున్నారు. అప్పటి ఉమ్మడి వరంగల్ కలెక్టరేట్ అధికారులు 2012 జూన్ తొమ్మిదిన ఇచ్చిన ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని న్యాయం చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆమెను 'సాక్షి'పలకరించగా తన సమస్యను చెప్పుకుంది. 'అప్పటి చేర్యాల తహసీల్దార్ వెంకటేశ్వర్లు కొమురవెల్లి గ్రామంలో సర్వే నంబర్లు 199, 223లో ప్రభుత్వ భూమి ఉందని 500 గజాల స్థలం కేటాయించారు. ఐదెకరాల వ్యవసాయ భూమి విషయంలోనూ నివేదికిచ్చారు. 2012 నుంచి 2016 వరకు అధికారుల చుట్టూ తిరిగా. మధ్యలో కాలి బుల్లెట్ గాయం తిరగదోడడంతో కొన్ని నెలలు విశ్రాంతి తీసుకున్నా. ఇప్పటికే సిద్దిపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లా. అక్కడా పోలీసులను కలిశా. వారు వరంగల్‌కు వెళ్లాలని చెబితే మూడు నెలల నుంచి ఇక్కడి ఐదుసార్లు వచ్చా. మూడుమార్లు పోలీసులను కలిశా. రెండుసార్లు వరంగల్ కలెక్టర్‌ను కలిశా. ఇప్పటికైనా సంబంధిత పత్రాలు నాకు ఇచ్చి భూమి కేటాయించి నా కుటుంబానికి భరోసాను ఇవ్వాలి'అని స్వరూప కన్నీటి పర్యంతమయ్యారు.

ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించుకోవాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి సాయికుమార్

రామన్నపేట : చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించుకోవాలని వరంగల్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.సాయికుమార్ సూచించారు. 'ప్రపంచ ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా సోమవారం నగరంలోని ప్రభుత్వ బాలుర పరిశీలక గృహంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని హనుమకొండ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండేతో కలిసి ప్రారంభించారు. ఆరోగ్యంగా ఉండాలంటే రోజూ కొంత సమయం వ్యా యామం చేయాలన్నారు. ముఖ్యంగా దూమపానం, మత్తు పదార్థాలు లాంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు.బాలురకు ఆరోగ్యంపై అవగాహనతోపాటు న్యాయ సేవా సంస్థ విధులు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. అనంతరం బాలురకు టూత్ బ్రష్‌లు, పండ్లు అందించారు. జిల్లా లీగల్ ఎయిడ్ కౌన్సిల్ పి.శ్రీనివాసరావు, మెడికల్ ఆఫీసర్ యశస్విని, డెంటల్ స్పెషలిస్ట్ భరత్, పరిశీలక గృహం సూపరింటెండెంట్ శ్రీదేవి పాల్గొన్నారు.

బదిలీ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- టీఎన్జీఓస్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్


కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేయాలని చూడడం సరికాదని, వెంటనే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని టీఎన్జీఓస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఆయన టీఎన్జీఓస్ నాయకులు, పంచాయతీ కార్యదర్శులతో కలిసి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. 8 నెలల క్రితమే సాధారణ బదిలీల్లో భాగంగా పెద్ద సంఖ్యలో పంచాయతీ కార్యదర్శులను బదిలీ చేశారని, తిరిగి ఇప్పుడు మళ్లీ బదిలీలు చేయడం వల్ల కార్యదర్శులు అనేక ఇబ్బందులకు గురవుతారని పేర్కొన్నారు. గ్రామాల్లో పాలకవర్గం ముగిసి ఏడాది గడిచినా పంచాయతీ ఎన్నికలు కాకపోవడంతో చాలాచోట్ల గ్రామాల అభివృద్ధి పనులకు ఆయా గ్రామాల కార్యదర్శులే పెద్ద మొత్తంలో సొంత డబ్బులు ఖర్చు చేశారని, ఇప్పుడు వేరే ప్రాంతానికి వెళ్తే వారు ఖర్చు పెట్టిన సొమ్ము వారికి అందడం కష్టమవుతుందన్నారు. వారు ఖర్చు చేసిన డబ్బులను వెంటనే ప్రభుత్వం నుంచి ఇప్పించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. పంచాయతీ కార్యదర్శుల బదిలీలను టీఎన్జీఓస్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎన్జీఓస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, అసోసియేట్ అధ్యక్షుడు పుల్లూరు వేణుగోపాల్, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం కార్యదర్శి ఇంజపల్లి నరేశ్, నాయకులు ఎండీ రఫీ, వెంకన్న, సురేశ్, కృష్ణంరాజు, సౌజన్య, అంజలి, వెంకటేశం, ప్రవళిక, లావణ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ సైన్సెస్ వర్సిటీగా కొత్తగూడెం ఇంజనీరింగ్ కాలేజీ

అప్‌గ్రేడ్ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

- కేయూ నుంచి విడిపోనున్న కళాశాల
- బోధన, బోధనేతర పోస్టులు, ఆస్తుల బదలాయింపు కూడా..
- ఆ నలుగురి అధ్యాపకుల డిప్యుటేషన్లు రద్దయ్యే అవకాశం?


విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి కేక్‌కట్ చేస్తున్న ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రాజు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీని ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా ఉత్తర్వులు జారీ చేశారు. సహజవనరులు పుష్కలంగా ఉన్న ఈ ప్రాంతంలో వర్సిటీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. ఈ నేపథ్యంలో ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కూడా వర్సిటీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దీనిని అమలులోకి తీసుకొస్తూ ఎర్త్‌సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ పేరుతో జీఓ జారీ అయ్యింది. ఇందుకు అనుగుణంగా తెలంగాణ యూనివర్సిటీల చట్టం 1991కు సవరణ చేసింది.దీంతో కొత్తగూడెం ప్రాంతవాసులు, విద్యార్థులు, అధ్యాపకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కేయూ నుంచి బోధన, బోధనేతర, ఆస్తుల బదలాయింపు!

కొత్తగూడెంలో 1978లో స్కూల్‌ఆఫ్‌మైన్స్ ఓయూ పరిధిలోని పీజీ సెంటర్‌గా ఏర్పాటు అయింది. కాకతీయ యూనివర్సిటీ ఏర్పాటైన అనంతరం 1996 నుంచి కొత్తగూడెం స్కూల్ ఆఫ్‌మైన్స్ కేయూ పరిధిలోకి కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీగా ఆవిర్భవించింది. అప్‌గ్రేడ్ నేపథ్యంలో యూనివర్సిటీ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజీలో బోధన, బోధనేతర పోస్టులతో సహా ప్రస్తుతం ఉన్న ఆ కాలేజీ ఆస్తులు కూడా ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి బదలాయింపు జరగబోతుంది. ఇంజనీరింగ్‌కాలేజీలో 41అధ్యాపకుల పోస్టులకుగాను ప్రస్తుతం 16మంది పనిచేస్తున్నారు. పలువురు కాంట్రాక్టు అధ్యాపకులు పనిచేస్తున్నారు.అధ్యాపకుల కొరత ఉంది. 106 నాన్‌టీచింగ్‌పోస్టులు ఉంటే 60 మంది వరకు పనిచేస్తున్నారు. వర్సిటీగా అప్‌గ్రేడ్‌తో పోస్టులు పెరిగే అవకాశాలున్నాయి.

ఆ నలుగురి డిప్యుటేషన్లు రద్దవుతాయా?

కాకతీయ యూనిర్సిటీ పరిధిలోని కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ కాలేజీలో గతంలో నియామకమై అక్కడ కొంత కాలం పనిచేసి కేయూలోని ఇంజనీరింగ్ కళాశాలలకు డిప్యుటేషన్‌పై వచ్చిన వారిలో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు భిక్షాలు, వెంకటరమణ, ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు రాధిక, సుమలత ఉన్నారు. ఇప్పుడు కొత్తగూడెం మైనింగ్ ఇంజనీరింగ్ యూనివర్సిటీగా అప్‌గ్రేడ్ అయిన నేపథ్యంలో వీరి డిప్యుటేషన్లు రద్దవుతాయా అనే అంశం చర్చగా మారింది. ఎందుకంటే వారి పోస్టులు అక్కడే. అందుకే ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి బదలాయింపు జరగనున్న నేపథ్యంలో వీరు అక్కడికి వెళ్లాల్సింటుందనే అంశం యూనివర్సిటీలో చర్చగా ఉంది. లేదా వారికి ఏమైనా ఆప్షన్ ఇస్తారా లేదా వేచి చూడాల్సిందే.

రైతులకు నేను వ్యతిరేకం కాదు

- మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

ధర్మసాగర్: హనుమకొండ జిల్లాలో ఉన్న ఏకైక అటవీ సంపద దేవునూరు భూములను కాపాడమే తనలక్ష్యమని, రైతులకు తాను వ్యతిరేకం కాదని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ అధికారులు రైతులకు సంబంధించిన భూములను ఇనుపరాతి గుట్టలు (దేవనూరు) అడవి సరిహద్దు దాటిన తరువాత చూపించాలని, ఇష్టానుసారంగా అడవి మధ్యలో చూపెట్టడం సరికాదని పేర్కొన్నారు. రైతుల పేరుతో ఎవరైనా ప్రైవేటు వ్యక్తులు అన్యాయంగా అడవిలోకి చొరబడి అటవీ సంపదను నాశనం చేస్తానంటే చూస్తూ ఊరుకునేది లేదని, ఈ విషయాన్ని ప్రతీ రైతు గమనించాలని కోరారు. సర్వే పూర్తయింది కానీ, దాని ఫైనల్ రిపోర్ట్ రాలేదని అటవీశాఖ అధికారులు చెప్పారని వెల్లడించారు. ట్రెంచ్(కందకం)దాటి లోపలికి వచ్చి చదును చేయడంపై పరిశీలించడానికి వచ్చామని తెలిపారు. కలెక్టర్ కూడా ఇందులో ఇన్‌వాల్వ్ అయ్యారనే విషయం తెలుస్తోందని, ఇప్పటికైనా సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేస్తూ అటవీ సంపదను కాపాడాలని కోరారు.

గోదావరి పరీవాహక ప్రాంత అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి


వీసీలో మాట్లాడుతున్న సీఎండీ వరుణ్‌రెడ్డి

హన్మకొండ: వాతావరణ శాఖ ఈదురు గాలులు, భారీ వర్షాలు ఉన్నాయని హెచ్చరించిన నేపథ్యంలో గోదావరి పరీవాహక ప్రాంతాల విద్యుత్ అధికారులు, ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని టీజీఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి సూచించారు. సోమవారం హనుమకొండలోని టీజీఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వరుణ్‌రెడ్డి మాట్లాడుతూ భూపాలపల్లి, భద్రాద్రి కొత్తగూడెం పరిధిలో ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా మానిటర్ చేస్తూ ఏదైనా అంతరాయం జరిగితే వెంటనే పునరుద్ధరించాలని ఆదేశించారు. చెట్లు విరిగి విద్యుత్ లైన్లపై పడితే, ట్రిప్పింగ్స్, బ్రేడౌన్‌లు సంభవిస్తే త్వరితగతిన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని సూచించారు. పంటల కోతలు జరుగుతున్నందున పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ సర్వీస్‌ల మంజూరు వేగవంతం చేయాలన్నారు. అత్యవసర సమయంలో కావాల్సిన మెటీరియల్‌ను సమకూర్చుతామన్నారు. వ్యవసాయానికి అవసరమైన చోట 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ సర్కిల్‌లో ఎల్‌సీ యాప్‌పై సిబ్బందికి శిక్షణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.సదర్‌లాల్, జీఎంలు, ఎస్‌ఈలు, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

సకాలంలో మిర్చి కొనుగోళ్లు చేపట్టాలి

- మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి


మాట్లాడుతున్న ఆర్డీడీఎం పద్మావతి

మహబూబాబాద్ రూరల్ : రైతుల అవసరాలు, ఇబ్బందులు గుర్తించి సకాలంలో మిర్చి కొనుగోళ్లు చేపట్టాలని మార్కెటింగ్ శాఖ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ (ఆర్డీడీఎం) పద్మావతి అన్నారు. ఈమేరకు సోమవారం మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా క్రయవిక్రయాల తీరును పరిశీలించి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. రైతులు, వ్యాపారుల అవసరాల మేరకు మార్కెట్ యార్డు ప్రాంగణంలో వసతుల కల్పనపై దృష్టి సారిస్తామన్నారు. మిర్చి, మక్కలు, ధాన్యం, పత్తి, అపరాలు కొనుగోళ్ల సందర్భంలో రైతులకు వ్యాపారులు సహకరించాలని కోరారు. అనంతరం ఈ ఏడాది సీజన్‌లో జరిగిన మిర్చి క్రయవిక్రయాలు, మార్కెట్ ఆదాయంపై రికార్డులు తనిఖీ చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్, వైస్ చైర్మన్ మదన్ గోపాల్ లోయ, సెక్రటరీ షంషీర్, సూపర్‌వైజర్ రమేష్, అసిస్టెంట్ సూపర్‌వైజర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

నేలబొగ్గును మింగిన బాలుడు మృతి


అయాన్ (ఫైల్)

గీసుకొండ: ఇంధనం(నేల) బొగ్గును మింగి ఓ బాలుడు మృతి చెందాడు. బాలుడి బంధువులు, గీసుకొండ సీఐ మహేందర్ కథనం ప్రకారం.. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం విశ్వనాథపురం గ్రామంలో కొర్ర రాజు–శ్రీలత దంపతులకు ముగ్గురు సంతానం. ఇద్దరు కూతుళ్లు జన్మించిన తర్వాత మూడవ సంతానంగా కొర్ర అయాన్(9) జన్మించాడు. రాజు కొమ్మాల స్టేజీ వద్ద బిర్యానీ సెంటర్ నిర్వహిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఈ నెల 5న బాలుడి తల్లి తన కుమారుడు అయాన్‌ను తీసుకుని బిర్యానీ సెంటర్‌కు వెళ్లింది. కుమారుడు అయాన్ ఆడుకుంటూ వెళ్లి పొయ్యి దగ్గరలోని వంట చెరుకుకు ప్రత్యామ్నాయంగా వాడే నేల బొగ్గు(వ్యవహారికంగా రైల్వే బొగ్గు అంటారు)ను మింగాడు. కొద్ది సేపటికి గమనించిన తల్లి బాలుడి నోటిలో బొగ్గును తొలగించి కడిగింది. ఆ తరువాత బాలుడికి శ్వాస రాక ఏడుస్తుండడంతో తల్లిదండ్రులు నర్సంపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఎక్స్‌రే తీసి పరిస్థితి విషమంగా ఉందని వెంటనే హైదరాబాద్ నీలోఫర్ ఆస్పత్రికి తరలించాలని సూచించగా, బాలుడిని నీలోఫర్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఇద్దరు కుమార్తెల తర్వాత పుట్టిన బాబు కావడంతో గారాబంగా పెంచుకుంటున్న సమయంలో అనుకోని రీతిలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, బంధువుల రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

బొగ్గు ఎందుకు ప్రమాదకరం..!

బొగ్గు తినడం చాలా ప్రమాదకరం అని వైద్యులు చెబుతున్నారు. బొగ్గులో పాదరసం, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్ లాంటి హానికరమైన రసాయనాలు ఉంటాయని, అందుకే బొగ్గును తిన్న బాలుడు శ్వాస ఆడక మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు.

హనుమకొండ కలెక్టరేట్ పార్కుకు ఉత్తమ అవార్డు


గోల్డెన్ ట్రోఫీ, సర్టిఫికెట్‌ను ప్రదర్శిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

హన్మకొండ అర్బన్: హనుమకొండ కలెక్టరేట్‌లోని పార్కుకు రాష్ట్ర ఉద్యానశాఖ ద్వారా నిర్వహించిన 8వ గార్డెన్ ఫెస్టివల్‌లో ఉత్తమ గార్డెన్‌గా అవార్డు లభించినట్లు జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి వెంకటేశం తెలిపారు. సంబంధిత గోల్డెన్ ట్రోఫీ, సర్టిఫికెట్‌ను కలెక్టర్ ప్రావీణ్య అధికారుల సమక్షంలో ప్రదర్శించారు. సుమారు 114 రకాల పూలు, నీడనిచ్చే మొక్కలను నాటి ఆహ్లాదకరంగా తీర్చిదిద్దడమేకాకుండా వాటి రక్షణ చర్యలు చేపడుతూ రాష్ట్ర స్థాయి అవార్డు పొందడంపై అభినందించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, డీఆర్ఓ వై.వి గణేష్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ..

ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వారోత్సవాలను పురస్కరించుకొని జన విజ్ఞాన వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన వేసవిలో జాగ్రత్తలు (ఎండ వేడి తీవ్రత నుంచి ఉపశమనం, ఉపాయాలు), కృత్రిమ రసాయన శీతల పానీయాలు నివారించాలనే కరపత్రాలను సోమవారం కలెక్టర్ ప్రావీణ్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆచార్య లక్ష్మారెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కాజీపేట పురుషోత్తం, ఉపాధ్యక్షులు రాములు, ఉమామహేశ్వర్ రావు, కోశాధికారి పరికిపండ్ల వేణు, కార్యవర్గ సభ్యులు వకుళాభరణం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సిక్కిం గవర్నర్‌ను కలిసిన మౌంటైనర్ యశ్వంత్


గవర్నర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న యశ్వంత్

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యతండా గ్రామ పంచాయతీకి చెందిన మౌంటైనర్ భూక్య యశ్వంత్ సోమవారం సిక్కిం గవర్నర్ ఓమ్ ప్రకాశ్ మాథూర్‌ని ఆ రాష్ట్ర రాజ్‌భవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తన వంతు సహకారం, ఆశీస్సులు ఉంటాయని, విజయం వైపు దూసుకెళ్లాలని యశ్వంత్‌కు గవర్నర్ సూచించారు. పట్టుదలతో ప్రపంచంలోనే ఎత్తయిన పర్వతాలను అధిరోహించి భారత దేశ ఖ్యాతి విశ్వవ్యాప్తం చేయాలని యశ్వంత్‌ను గవర్నర్ దీవించారు.

విద్యార్థిని ఆత్మహత్య

- హైదరాబాద్‌లో ఘటన


స్పందన (ఫైల్)

మరిపెడ: మరిపెడకు చెందిన ఓ విద్యార్థిని హైదరాబాద్‌లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మండల కేంద్రం సీతారాంపురం కాలనీకి చెందిన కొమ్ము పరశురాములు పెద్ద కూతురు స్పందన (18) కొంత కాలంగా తల్లితో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. ఈ క్రమంలో సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. స్పందన ఇటీవల ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసింది. కాగా, విద్యార్థిని ఆత్మహత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

లోకోపైలెట్ల సమస్యలు పరిష్కరించాలి

- రైల్వే మజ్దూర్ యూనియన్ నేతల డిమాండ్


నిరసన తెలుపుతున్న నేతలు

కాజీపేట రూరల్ : రైల్వే లోకోపైలెట్ల సమస్యలు పరిష్కరించాలని రైల్వేమజ్దూర్ యూనియన్ లోకో రన్నింగ్ బ్రాంచ్ నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాజీపేట రైల్వే క్రూ లాబీ ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వే రన్నింగ్ స్టాఫ్ సమస్యలపై రైల్వే బోర్డుతో చర్చలు జరిగాయన్నారు. ఇందుకు రైల్వే బోర్డు మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేసిందని తెలిపారు. అయితే ఆ కమిటీ ఈ నెల 4వ తేదీ న బోర్డుకు సమర్పించిన నివేదిక రన్నింగ్‌స్టాఫ్‌కు వ్యతిరేకంగా ఉందన్నారు. ఆ రిపోర్టును అమలు చేయొద్దని డిమాండ్‌తో దేశ వ్యాప్తంగా అన్ని క్రూ లాబీల వద్ద చేస్తున్న నిరసనలో భాగంగా కాజీపేట లాబీ వద్ద కూడా నిరసన చేపట్టామని తెలిపారు. బ్రాంచ్ చైర్మన్ సంగ రమేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సెక్రటరీ సాయికుమార్, రమేశ్, ఎన్.కుమారస్వామి, ఎ.కుమారస్వామి, ఎం. ప్రవీణ్, ధనరాజ్, వలీఅహ్మద్, ఎన్.శ్రీనివాస్, వి.ప్రసాద్, భరత్‌లోకోశ్, రమణాచారి, ఆంజనేయులు, సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.